క్లుప్తంగా

చదువు పేరుతో వ్యాపారమా..?

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా వ్యాప్తంగా చదువు పేరుతో వేల రూపాయలు దోచుకుంటున్న వారిపై చర్యలు తీసుకోకుండా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. శనివారం నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువునే వ్యాపారంగా మార్చుకున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. కడప నగరం, బద్వేలు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు, పోరుమామిళ్ల ప్రాంతాలలో పుట్టగొడుగులు లాగా విద్యాసంస్థలు స్థాపించి ఈరోజు విద్యార్థులను తల్లిదండ్రులను అధిక ఫీజులతో, పుస్తకాల పేరుతో లక్షల రూపాయలు దందా చేస్తున్నారని విమర్శించారు. చదువు పేరుతో వ్యాపారం చేసే విద్యాసంస్థలపై కఠినమైన చర్యలు తీసుకొని, పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, కడప నగర కార్యదర్శి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: పెండింగ్‌లో ఉన్న రాయలసీమ నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర కోరారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమ నెల్లూరు ప్రకాశం జిల్లాల నీటి కొరతకు శాశ్వత పరిష్కారం అంటూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో తెలుగు తల్లికి జల హారతి పేరుతో రూ.80,112 కోట్ల అంచనా వ్యయంతో గోదావరి బనకచర్ల ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. అయితే ఇవేవీ రాయలసీమ తాగు సాగు నీటి కష్టాలు తీర్చడం కోసం కాదని అధికార పార్టీ నేతల ఆర్థిక లోటును తీర్చుకోవడం కోసమేనని విమర్శించారు. జాతీయ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టును పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో పూర్తి సామర్థ్యంతో నిర్మించాలన్నారు. రాయలసీమలో నిర్మాణంలో ఉన్న గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగు గంగ, వెలుగొండ, రాజోలి రిజర్వాయర్ పనుల పూర్తికి తగినన్ని నిధులు కేటాయించి, పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్ వెంకట శివ, సహాయ కార్యదర్శి కే సి బాదుల్లా పాల్గొన్నారు.

9న కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప కార్పొరేషన్ లో డాక్యుమెంట్ అప్లోడ్ చేయకుండా అక్రమంగా ఇంటి పన్ను మార్పు చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని, యథావిధిగా భూమన వెంకటసుబ్బయ్య పేరున ఇంటి పన్ను వచ్చే విధంగా తగు చర్యలు చేపట్టాలని కోరుతూ 9న కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి యస్. వెంకట శివ తెలిపారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెంకట శివ మాట్లాడుతూ కడప శివానందపురంలో దళిత వృద్ధురాలు భూమన పిచ్చమ్మ ఇంటిని అక్రమంగా కూల్చివేయడంలో పాలు పంచుకున్న చెన్నూరు బాల గురవయ్య తన కొడుకు బాల కుమార్ పేరు పై రిజిస్టర్ చేసుకునేందుకు కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎలాంటి ధ్రువ పత్రాలు లేకుండానే అక్రమంగా తమ పేరుపై మార్పించుకోవడం అడ్డగోలు అవినీతికి పరాకాష్ట అని విమర్శించారు. లంచాలకు కక్కుర్తి పడిన ఒకరిద్దరు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా బి.వెంకటసుబ్బయ్య పేరున ఉన్న ఇంటి పన్ను ను అక్రమంగా అడ్డగోలుగా ఎటువంటి దస్తావేజులు పొందకుండా సి. బాల గురవయ్య పేరున మార్పు చేసిన వారిని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె.మునయ్య, ఏపీ గిరిజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు బ్రహ్మం, శంకర్ నాయక్, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి



బాలనాగమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి నరసింహారెడ్డి మాతృమూర్తి బాలనాగమ్మ(90) మృతిచెందారు. శుక్రవారం రాత్రి 9.30 గంటలకు ఆమె మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాలనాగమ్మకు నలుగురు కుమార్తెలు, ఏకైక కుమారుడు నరసింహారెడ్డి ఉన్నారు. బాలనాగమ్మ మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయన సతీమణి అరుణమ్మ, మాజీ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్మెన్ రామగోవిందరెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మెన్ పులి సునీల్ కుమార్ తదితరులు ఆలంఖాన్‌పల్లెలోని భైరవ కాలనీలో ఆయన స్వగృహానికి వెళ్లి ఆమె మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శాంతి, త్యాగం, సహకారమే జీవితం



కడప నగరం బిల్టప్ ఈద్గా వద్ద నమాజ్ ప్రార్థనల్లో ముస్లింలు

కడప కల్చరల్ : ముస్లింలకు అత్యంత ఆరాధనీయమైన పవిత్రమైన పండుగ బక్రీద్‌ను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం 10.30 గంటలకు ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. పలువురు భక్తులు తమ సమీపంలోని మసీదుల్లో జరిగే ప్రార్థనల్లో పాల్గొనగా, అధికశాతం మంది ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బిల్టప్ ఈద్గాలో..

కడపలోని బిల్టప్ వద్దగల ఈద్గాలో నగర వాసులతోపాటు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు ముఫ్తీ మహమ్మద్ న్యామతుల్లా పండుగ సందేశమిస్తూ దైవం.. మానవుని దయా, త్యాగ గుణాల గురించి కఠినమైన పరీక్షలు పెడతారని, అందులో నెగ్గిన వారికి మంచి జీవితం ప్రసాదిస్తారని తెలిపారు. వారినే మానవ లోకానికి ఆదర్శంగా నిలుపుతారన్నారు. భక్తులు అల్లాహ్ మార్గాన్ని అనుసరించి ఆయన ఇచ్చిన ఈ ప్రాణాన్ని ఆయన మార్గంలో సమర్పించేందుకు ఏమాత్రం వెనుకాడకూడదని, అలాగే మనిషిలోని చెడు గుణాలను కూడా వదిలి వేయాలని తెలిపారు. త్యాగానికి ప్రతీకగా ప్రవక్త హజరత్ ఇబ్రహీం అల్లాహ్ ఆదేశాన్ని పాటించిన సంఘటన గురించి వివరించారు. అలాగే మనుషుల్లో త్యాగ గుణం పెరగాలని, దైవం పేరిట త్యాగం చేయడంతోపాటు సాటి మనుషులతో పరస్పరం సహకరించుకుంటూ ఉన్నప్పుడే ప్రశాంత జీవనం, ప్రపంచ శాంతి సాధ్యమవుతాయన్నారు. త్యాగ గుణాన్ని దైవం ఎంతో అభిమానిస్తారని, త్యాగాలు చేసే వారిపై ఆయన తన కరుణను వర్షిస్తారన్నారు. ప్రస్తుత స్థితిలో ప్రపంచమంతా నెలకొన్న అశాంతిని, అలజడిని తొలగించడానికి త్యాగం ఒక్కటే శాశ్వత పరిష్కారమని దైవం బోధించారని తెలిపారు.

ప్రత్యేక ప్రార్థనలు

పండుగ సందర్భంగా కడప పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకుముందు పెద్దదర్గా మసీదులో పీఠాధిపతి భక్తులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన బిల్టప్ ఈద్గాకు చేరుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. చివరగా పీఠాధిపతిని భక్తులు కలిసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులతోపాటు స్థానిక ప్రముఖులు పీఠాధిపతిని కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిజేసినంతరం ఆశీస్సులు పొందారు. భక్తుల సౌకర్యార్థం కార్పొరేషన్ అధికారులు విశేష ఏర్పాట్లు చేశారు. అలాగే స్థానిక నాయకులు శ్రీనివాసులురెడ్డి పీఠాధిపతిని కలిసి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులు ఒకరినొకరు హత్తుకుని ×ఈద్ ముబారక్ హో¤ అంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దదర్గా ముజావర్, దర్గా భక్తులు పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

పోలీసుల సహకారం

బక్రీద్ ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసుశాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. కడప డీఎస్పీ పర్యవేక్షణలో పలువురు సీఐలు, ఎస్ఐలు కట్టుదిట్టమైన రక్షణ చర్యలు చేపట్టారు. ప్రార్థనల సందర్భంగా ట్రాఫిక్‌ను ముందే మళ్లించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగలేదు.

భక్తులతో కళకళలాడిన మసీదులు, ఈద్గాలు

త్యాగానికి, దైవంపై విశ్వాసానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన బక్రీద్ (ఈదుల్ జుహా) పండుగను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని మసీదులు, ఈద్గాలలో ఆయా మత గురువులు పండుగ ప్రార్థనలు నిర్వహింపజేశారు. అల్లాహ్ దయ పొందిన హజరత్ ఇబ్రహీం నడిచిన త్యాగాల బాటలో ముస్లింలు పయనించాలని, దైవం పట్ల అంచెలంచెలుగా విశ్వాసాన్ని కలిగి ఉండాలని, ఆయన కృపను పొందాలని పేర్కొన్నారు. ముస్లింలందరూ సాటి మానవుల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. ప్రతి ప్రార్థనల్లో ప్రపంచ శాంతి కోసం గురువులు ప్రార్థించారు. అనంతరం ఒకరునొకరు అలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

దండు ఈద్గాలో..

కడప నగర పరిధిలోని దండు షాహి ఈద్గాలో ఉదయం 10.45 గంటలకు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మురాదియా షాహి ఈద్గా వారసులు, ముతవల్లి హజరత్ జమాలుల్లాబాష సాహెబ్ పండుగ సందేశం అందజేశారు. అనంతరం భక్తులచే సామూహిక ప్రార్థనలు చేయించారు. కార్యక్రమంలో అక్మల్‌పీరా మురాది సాహబ్, నగర ప్రముఖులు, పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

అమీన్‌పీర్ దర్గా మసీదులో..

పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో దర్గా మసీదులో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువులు తన ప్రసంగంలో ఏకేశ్వరుడైన అల్లాహ్ ప్రవక్త ద్వారా త్యాగాన్ని ప్రబోధించారని, ప్రతి ముస్లిం వారి ఆజ్ఞలను పాటించాలన్నారు. అనంతరం భక్తులచే సామూహికంగా ప్రార్థనలు చేయించారు.

మజ్జిద్-యే-కుబాలో..

నగరంలోని రామాంజనేయపురం సాగర్‌కాలనీలో గల మజ్జిద్-యే-కుబాలో ఉదయం 7.00 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువు అబ్దుల్ కబీర్ ఉమ్రి పండుగ ప్రాధాన్యతను వివరించారు. మహిళలకు సంబంధించి ప్రత్యేక ప్రార్థనల కోసం విశేష ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు, నగర ప్రముఖులు, ముస్లింలు పాల్గొన్నారు.

మజ్జిద్-యే-బుఖారియాలో ..

రవీంద్రనగర్‌లోని మజ్జిద్-యే-బుఖారియాలో ఉదయం 6.15 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రభుత్వ ఖ్వాజీ, మజ్జిద్ ఇమామ్-ఓ-ఖతీబ్ సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి సాహెబ్ భక్తులతో ఈదుల్ జుహా ప్రార్థనలు నిర్వహింపజేశారు. పండుగ సందేశం అందజేస్తూ త్యాగ గుణాన్ని అలవర్చుకోవాల్సిన అంశాన్ని వివరించారు.

జమాయత్ తుస్సాలిహాత్ మదరసా మైదానంలో..

నగరంలోని జమాయత్ తుస్సాలిహాత్ మదరసా మైదానంలో బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్యాగ గుణాన్ని, పవిత్ర మాసం ప్రాధాన్యతను తెలియజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.



దండు షాహి ఈద్గాలో బక్రీద్ సందేశం అందజేస్తున్న హజరత్ జమాలుల్లాబాషా సాహెబ్



బిల్టప్ ఈద్గాకు చిన్నారులతో కలిసి వస్తూ..



బక్రీద్ సందేశాన్ని అందజేస్తున్న హజరత్ సిరాజుద్దీన్ బుఖారి సాహెబ్



భక్తులను ఆశీస్సులు అందజేస్తున్న పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్



జమాయత్ తుస్సాలిహాత్ మదరసాలో..



దండు షాహి ఈద్గాలో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు..



ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు

క్రీడలతో మానసిక ఉల్లాసం

వేంపల్లె : క్రీడల ద్వారా మానసికంగా, ఉల్లాసంగా ఉంటారని గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు పోటీలు జరిగాయి. క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో నందిమండలం, వేంపల్లె జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో నంది మండలం జట్టు విన్నర్‌గా నిలవగా, వేంపల్లె జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా సర్పంచ్ విన్నర్ జట్టుకు రూ.20వేలతోపాటు షీల్డ్, రన్నర్ జట్టుకు రూ.15వేల నగదుతోపాటు షీల్డ్‌లను అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా పీటర్, బెస్ట్ బౌలర్‌గా యేసయ్య, బెస్ట్ ఫీల్డర్‌గా సాయిలకు కన్సలేషన్ బహుమతులను అందించినట్లు క్రికెట్ టోర్నీ ఆర్గనైజర్ భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి కాశిరెడ్డి ఆదినారాయణ, రాష్ట సంయుక్త కార్యదర్శి ఆర్.వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పోరాటినికి పిలుపు ఇచ్చినప్పుడు ఎస్జీటీలకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని, అయితే కమిషనర్ హామీని తుంగలో తొక్కి వెబ్ కౌన్సెలింగ్ పేరుతో ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేయడం తగదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. శనివారం సాయంత్రం యూటీఎఫ్ భవన్‌లో వారు మాట్లాడుతూ ఎస్జీటీ ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్ కాకుండా మ్యాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలను నిర్వహించాలని కోరుతున్నామన్నారు. అయితే ఉపాధ్యాయుల బదిలీల విషయంలో విద్యాశాఖకు ఏ ఒక్క విషయంపై స్పష్టత లేదని, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన విధంగా కాకుండా ఇష్టం వచ్చినరీతిలో బదిలీలను నిర్వహించడం తగదన్నారు. ప్రిఫరెన్సియల్ క్యాటగిరికి సంబంధించి వికలాంగులు, వితంతువులు, విడాకులు పొందిన టీచర్ల పట్ల దుర్మార్గపు విధానాలను తీసుకొచ్చి మానసిక క్షోభకు గురిచేస్తున్నారన్నారు. బదిలీల విషయంలో ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయం వివాదాస్పదంగా ఉందని, అవగాహన రాహిత్యంతో ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ విధానాలను అనుసరిస్తూ ముందుకెళుతున్నారన్నారు. స్కూల్ అసిస్టెంట్ టీచర్లను ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా బదిలీ చేయడం, ఇంగ్లీషు, గణితం ఉపాధ్యాయులను కాంప్లెక్స్ ఉపాధ్యాయుల పేరుతో అభద్రతకు గురిచేయడం, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఎటువంటి పదోన్నతులు కల్పించకపోవడం వంటి అసంబద్ధ నిర్ణయాలు తగవన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే స్పందించి అసంబద్ధ బదిలీలను ఆపి ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి హామీ ఇచ్చిన మేరకే ఎస్జీటీ ఉపాధ్యాయులకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షురాలు సుజాతరాణి, జిల్లా కార్యదర్శి ఎజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, రూతు ఆరోగ్యమేరి, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపినాథ్, చంద్రశేఖర్, శంకర్‌రెడ్డి, దేవదత్తం, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా

శ్రీ వాసవాంబ సన్నిధిలో భక్తిశ్రద్ధలతో గౌరీ వ్రతం

కడప కల్చరల్ : కడప నగరం కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో స్థానిక మహిళా భక్తులు మంగళగౌరీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్(ఆవోపా) మహిళా విభాగం ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. హైదరాబాదుకు చెందిన కొప్పరావూరి కోటేశ్వరరావు, అఖిల పావని దంపతుల పర్యవేక్షణలో ఆలయానికి లక్ష నాణ్యత గల పసుపు కొమ్ములను సేకరించి తీసుకురావడం విశేషం. భక్తిపూర్వకంగా కార్యక్రమాన్ని నిర్వహించినంతరం దాదాపు 400 మంది మహిళా భక్తులు లక్ష పసుపు కొమ్ముల గౌరీ వ్రతాన్ని నిర్వహించారు. సేకరించిన పసుపు కొమ్ములను రాసిగా పోసి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేసి పూలమాలలు అలంకరించారు. ఇటీవల కుంబాభిషేకం జరిగిన అనంతరం ఇంత పెద్ద కార్యక్రమం చేపట్టడం ఇదే తొలిసారి కావడంతో మహిళాభక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పసుపు కార్యక్రమం అనంతరం మహిళా భక్తులు ఒకరినొకరు మంగళ పూర్వకంగా వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు. అమ్మవారి కరుణ, కృపలతో ఈ కార్యక్రమం జరగడం మహిళా భక్తులందరికీ శుభదాయకమంటూ ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా విభాగం ప్రతినిధులు సాదు కృష్ణవేణి, అధ్యక్షులు దశమందం సుప్రియ, రెడ్డి లక్ష్మి, కోశాధికారి, మహిళా విభాగం సభ్యులు, ఆవోపా ప్రతినిధులు ముచ్చెర్ల వెంకట సుబ్బయ్య, సత్యప్రసాద్, ప్రతాపం సాయిరాం, కృష్ణం శివ వరప్రసాద్, వంకధారి చంద్రశేఖర్‌లు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



పసుపు కొమ్ముల రాసి వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శిల్పారామంలో బక్రీద్ సందడి



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో శనివారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా సాంస్కృతిక వేదికపై కడపకు చెందిన డ్రీమ్ మీడియా సహకారంతో స్థానిక నృత్య గురువు విజయశాంతి, ముద్ర డ్యాన్స్ బృందం పలు నృత్యాలను ప్రదర్శించింది. ప్రధానంగా చిన్నారులు పలు గీతాలకు ప్రదర్శించిన నృత్యాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమాలను శిల్పారామాల పాలనాధికారి కృష్ణప్రసాద్ పర్యవేక్షించారు.

గాయత్రి విద్యాసంస్థల ప్రభంజనం



ఎస్ఎన్‌ఫాతిమా



ఆర్‌వీ నిహారిక

కడప కోటిరెడ్డి సర్కిల్ : జూనియర్ ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో ఉన్నత మార్కులను గాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు సాధించారు. జూనియర్ ఎంపీసీలో ఎస్ఎన్ ఫాతిమా 467/470, ఆర్‌వీ నిహారిక 464, ఎన్.షర్మిల 463, పి.లక్ష్మీనరసింహ 462, పి.మేఘన 461, లక్ష్మి లహరి 461, పి.నంద కిశోర్ 460, బైపీసీలో ఎం.కీర్తి 432/440 విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని గాయత్రి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ పి.పెంచలయ్య తెలిపారు. ఎస్.రామసుబ్బారెడ్డి, కేవీఎల్ఎస్ జగదీష్, యాజమాన్యం తరపున ఎన్.పురుషోత్తం రెడ్డిలు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని డీపీసీ గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ సభ్యులు రామాంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, నాగసురేష్‌లు కోరారు. శనివారం ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డికి ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సమస్యలను పరిష్కరించాలని వారు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి స్పందిస్తూ మంత్రి లోకేష్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రమణయ్య, దస్తగిరి, నరసింహమూర్తి, సంటెప్ప తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీతోనే భారత దేశం అభివృద్ధి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలనలో భారత దేశం అభివృద్ధి చెందిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు తెలిపారు. శనివారం కడప నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కార్యశాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టి నేటికి 11 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఆయన పాలనలో భారత దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని అన్నారు. పేదల సంక్షేమం, సుపరిపాలన, వికసిత భారత్ సంకల్పం ఆధారంగా దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్నారన్నారు. ప్రపంచంలోని 175 దేశాలను ఒప్పించి జూన్ 21న యోగా డేగా ప్రపంచ దేశాలు జరుపుకునేలా పెద్ద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల వైద్య ఖర్చులను మిగిలించుకోవచ్చన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. ప్రతి కార్యకర్త ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సిద్దవటం: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకే వాహనాల తనిఖీ చేపట్టామని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. సిద్దవటం శివారులోని మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద శనివారం సాయంత్రం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ లేని పది మంది ద్విచక్ర వాహనదారులు, ఆటో చోదకులపై కేసు నమోదు చేసి రూ. 1800 జరిమానా విధించామని తెలిపారు.

నేడు బర్సీ

కమలాపురం : కమలాపురం పెద్ద దర్గాగా వెలుగొందుతున్న దర్గా-ఏ-గఫారియా దివంగత పీఠాధిపతి హాజి హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి బర్సీ ఆదివారం పీఠాధిపతి సజ్జాద్-ఏ-నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం పీఠాధిపతి ఇంటి నుంచి భక్తులతో ఊరేగింపు జరుగుతుందని వారు తెలిపారు. జహీరియా దర్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.